క్లుప్తంగా

ఎరువులు అందజేత

పలాస: అన్నదాతకు అన్ని వేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బ్రాహ్మణతర్లా గ్రామంలో రైతులకు శుక్రవారం ఎరువులు పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన సాగు నీటిని సకాలంలో అందించామని అన్నారు. ఎరువులను రాయితీలపై అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయశాఖ ఏడీ ఎల్.వి.మధుసూదన్, కూటమి నాయకులు వజ్జ బాబురావు, పి.విఠల్ ఉన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


అప్పలరాజు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల తహసీల్దార్‌గా ఆర్.అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్లు రఘుపతి మధు, కె.రాము, ఆర్ఐ శివరామకృష్ణ, సీనియర్ అసిస్టెంటు పాగోటి హరి, జూనియర్ అసిస్టెంటు భార్గవదాస్, డీఏ పూతి హరినారాయణ అభినందించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


భవానీశంకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీధర్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పదోవార్డు పొందరవీధికి చెందిన యువకుడు భవానీశంకర్ గుండెపోటుతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులు ఉమాకాంత్, రాము, అభిమన్యులను ఓదార్చారు.

భగవద్గీత పుస్తకాలు వితరణ


భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

సోంపేట: భగవద్గీత పఠనం మానవాళికి మార్గదర్శి అని మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి అన్నారు. బేసి రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని జీడిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు శుక్రవారం వితరణ చేశారు. విద్యార్థి దశ నుంచే భగవద్గీత పఠనం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు సంతోష్ ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేంద్రప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో అన్నారు. మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లు, డీఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను, సొంత స్థలంలో కట్టుకుంటున్న ఇళ్ల పూర్తయ్యేందు అందరి కృషి అవసరమని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మహారుద్రాభిషేకం


పూజల్లో పాల్గొన్న భక్తులు

టెక్కలి రూరల్: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న లలితా త్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శాస్త్రీయ మహా రుద్రాభిషేకం పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకులు తర్లా శివకుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులు జరగనున్న పూజల్లో భాగంగా రెండోరోజు హోమం, రుద్రం, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమాచార చట్టం యూత్ అధ్యక్షుడిగా నందుపిల్లి


నందుపిల్లి బాలాజీ

వజ్రపుకొత్తూరు: సమాచారం హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ, ప్రజా రక్షణ భేరి శ్రీకాకుళం జిల్లా యూత్ అధ్యక్షునిగా దేవునల్తాడకు చెందిన నందుపిల్లి బాలరాజు శుక్రవారం ఎన్నికైయ్యారు. ఇప్పటి వరకు వజ్రపుకొత్తూరు మండలంలో ఆ కమిటీ అధ్యక్షునిగా పనిచేస్తూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తిస్తూ సంస్థ చైర్మన్ కంచర్ల సురేష్ జిల్లా కమిటీ యూత్ అధ్యక్షునిగా బాలరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

• ఔదార్యం..


పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన రౌళజన్ని శోభారాణి పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వెంటనే శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. నిరుపేదకు చెందిన ఈమె దాతల సాయం కోరింది. దీనికి స్పందించిన బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ సభ్యులు స్పందించారు. రూ. 16 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శోభారాణికి శుక్రవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. – కాశీబుగ్గ

• అవగాహన..

వరినాట్లు వేసే ముందు నారు కొనలను తుంచివేసి నాటు కోవాలని వజ్రపుకొత్తూరు మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి రైతులకు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా పాతటెక్కలిలో ఆరోగ్యవంతమైన పంట (జీఏపీ) పండించే పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులకు పలు సూచనలు చేశారు. నారు కొనలను తుంచడం వల్ల పీకపురుగు నుంచి పంటను కాపాడుకోవచ్చునన్నారు. వీఏఏ వి.ప్రవీణ, ఏఈఓ ఎం.జ్యోత్స్న, పి.ఉదయ్ ఉన్నారు. –వజ్రపుకొత్తూరు



• బాధ్యతల స్వీకరణ


సోంపేట మండల తహసీల్దార్‌గా బి.అప్పలస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖ జిల్లా రాంబిల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. విధుల్లో చేరిన అప్పలస్వామికి కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. సిబ్బందితో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన తహసీల్దార్ అన్నారు. –సోంపేట

హద్దుమీరితే దండనే..

- అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లతో ప్రజల ఇబ్బందులు
- దృష్టి సారించిన పోలీసులు
- స్పెషల్ డ్రైవ్‌లో 90 సైలెన్సర్ల తొలగింపు

ఇచ్ఛాపురం:

ద్విచక్ర వాహనాలు వినియోగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో కాలుష్యం కూడా అదే స్థాయిలో ఉంది. దీనికి తోడు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లతో శబ్ద కాలుష్యం మరింత ఎక్కువ అవుతుంది. ఫలితంగా రోడ్డుపై నడవాలంటే జనం జంకుతున్నారు. చెవులు హోరెత్తేలా వచ్చే పెద్ద శబ్దంతో ఉలిక్కిపడుతున్నారు. చిరాకు, తీవ్ర తలనొప్పితో బాధపడడం, వినికిడి సమస్యలకు సైతం గురవుతున్నారు. ఈ పరిస్థితిలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లతో ఉన్న ద్విచక్ర వాహనాలపై ఇచ్ఛాపురం పోలీసులు దృష్టి సారించారు.


ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వాస్తవం ఇలా..

సాధారణంగా ద్విచక్ర వాహనాల కంపెనీలు సైలెన్సర్లు, హారర్లను నిర్దేశించిన మోతాదులో మాత్రమే శబ్దం వచ్చేలా తయారు చేస్తారు. ఇటువంటి వాటికే రవాణాశాఖ నుంచి అనుమతులు లభిస్తాయి. అయితే కొంతమంది ఈ నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే రకరకాల సైలెన్సర్లు, హారర్లను వాహనాలకు అమర్చుకుంటున్నారు. వీటి కోసం యువకులు వేలాది రూపాయలను వెచ్చిస్తున్నారు. కొంతమంది కంపెనీ నిర్దేశించిన సైలెన్సర్లు వినియోగిస్తున్నప్పటికీ అందులోని ఫిల్టర్లను తొలగించడం కారణంగా భరించలేని శబ్దం వెలువడుతుంది. ఇటువంటి శబ్దాలను సడన్‌గా వినడం వల్ల అనుకోని సమస్యలు ఎదురవుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, ఇతరులు సైలెన్సర్లు, హారన్ల నుంచి వచ్చే శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కట్టడికి చర్యలు

పర్యావరణ నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఆటోలు, లారీలు, వ్యాన్లకు ఆయా కంపెనీలు నిర్దేశించిన సైలెన్సర్లు, హారన్లను మాత్రమే వినియోగించాలి. అయితే కొంతమంది ఈ నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారిని అరికట్టేందుకు ఇచ్ఛాపురం సీఐ టి.ఇమ్మాన్యుయేల్‌రాజు, ఇతర పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. కొద్ది రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక శబ్దం వచ్చే లైసెన్సుతో ఉన్న 90 వాహనాలను గుర్తించారు. ఇలాంటి వినియోగించకూడదని అవగాహన కల్పించి సైలెన్సర్లను తొలగించారు.


తొలగించిన సైలెన్సర్లను చూపిస్తున్న సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు, పోలీస్ సిబ్బంది (ఫైల్)

చట్టం ఏమి చెబుతుందంటే..

ఒక వాహనం నిర్ణీత డెసిబల్స్ కంటే ఎక్కువ శబ్ద కాలుష్యానికి పాల్పడితే అది మోటారు వాహనాల చట్ట ప్రకారం నేరం. నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తే ఆ వాహనంపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేయవచ్చు. అమలులోకి వచ్చిన కొత్త చట్టం ప్రకారం శబ్ద కాలుష్యానికి పాల్పడిన మొదటిసారి వాహన చోదకుడికి రూ. వెయ్యి, రెండోసారి ఇదే పునరావృతమైతే రూ.10వేల వరకు జరిమానా లేకపోతే మూడు నెలలు జైలు మూడోసారి పునరావృతమైతే లైసెన్స్ రద్దుతోపాటు మూడు నెలల వరకు డిస్క్వాలిఫై చేయవచ్చు.

స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాం


వాహనాల వల్ల కలిగే శబ్ద కాలుష్యం నియంత్రణలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. దీనికోసం నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. మూడు నెలలుగా ఇచ్ఛాపురం పోలీసు సర్కిల్ పరిధిలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్న సైలెన్సర్లు, హారన్లను తొలగించి వాటిస్థానంలో ద్విచక్ర వాహనాల కంపెనీలు ఇచ్చిన వాటినే వేయించారు. ద్విచక్ర వాహనాలు, కార్ల నంబర్ ప్లేట్‌లపై ఎమ్మెల్యే తాలుకా, డాడ్స్‌గిఫ్ట్, అమ్మ దీవెన, నన్ను చూసిఏడవకూ.. వంటివి లేకుండా చూసుకోవాలి. లేకపోతే వాటిపైన కూడా చర్యలు తీసుకుంటాం.
– ఇమ్మాన్యుయేల్‌రాజు, సర్కిల్‌ఇన్ స్పెక్టర్, ఇచ్ఛాపురం

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

• ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. కొళిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్పత్రితో పాటు గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలని, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆస్పత్రిలోనే ప్రసవాలు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం అవసరమైన నిధులు వెచ్చించాలని అన్నారు. సమావేశంలో వైద్యాధికారులు వై.కల్యాణి, రేవతి భేరి, సర్పంచ్ సంతోష్ మండలా, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, బొబ్బిలి దేవరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్ప

వినతుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

కవిటి: విద్యార్థులు, రైతులు పెట్టుకున్న అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావులేకుండా సత్వర చర్యలు తీసుకునేలా వీఆర్వోలు వ్యవహరించాలని తహసీల్దార్ బి.మురళీమోహనరావు అన్నారు. ఇటీవల విధుల్లో చేరిన తర్వాత తొలిసారిగా వీర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అంశాల పురోగతి ఎలా ఉందో సిబ్బందితో చర్చించారు. గతంలో వ్యవస్థాగతంగా ఉన్న లోపాల్ని సరిదిద్దుకుంటూ మనమంతా సమష్టిగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీ తదితర అంశాలపై ఆరా తీశారు. డీటీ పి.రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి ఉన్నారు.


మాట్లాడుతున్న మురళీమోహనరావు

రోగులకు ఆహారం అందజేత

కాశీబుగ్గ: సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు పట్టణంలోని సత్య సాయి విద్యావిహార్ విద్యార్థులు. పాకెట్ మనీలో కొంత మిగుల్చుకుంటూ ప్రతి నెలా నారాయణ సేవ చేస్తున్నారు. ఇందులో భాగంగా పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న రోగులకు ఆహార పొట్లాలను శుక్రవారం పంచిపెట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు ఉన్నారు.


బాలింతకు ఆహారాన్ని అందిస్తున్న విద్యార్థినులు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కాశీబుగ్గ: విద్యాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. టీసీ సెల్ రాష్ట్ర నాయకుడు లొడగల కామేశ్వరరావు, నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్‌కుమార్, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకర్, జోగ మల్లేష్, కుత్తమ లక్ష్మణరావు, కొరికాన శంకరరావు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన యూవీవీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక సభ్యులు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఉద్దానం ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థులకు గ్రంథాలయం ఏర్పాటు చేసి యువతకు చేస్తున్న సేవలను వివరించారు. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నామని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఉద్దాన ప్రాంతానికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో యూవీవీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుత్తుమ్ ప్రకాష్ మాస్టర్, జుత్తు పురుషోత్తం, జి.లోకేశ్వరరావు, చిన్నారావు, ఖాగేశ్వరరావు, ఢిల్లేశ్వరరావు, వినోద్‌కుమార్, వాసుదేవరావు, కోరాడ లింగమూర్తి, మహేష్, బాలరాజు ఉన్నారు.


ఎమ్మెల్యే శిరీషకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూవీవీ సభ్యులు

ఆస్పత్రుల్లో పరికరాలు అందుబాటులో ఉంచాలి

సోంపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్త పరీక్షలకు అవసరమైన పరికరాలు లేక పోవడం దారుణమని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ బీన ఢిల్లీరావు అన్నారు. సోంపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విష జ్వరాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం రోగులకు అందడం లేదన్నారు. సోంపేట సామాజిక ఆస్పత్రిలో సీబీసీ మిషన్ లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవడానికి పేదలకు రూ. రెండు వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు స్పందించి ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పలువురు బీసీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఢిల్లీరావు

వరుసల్లో వరినాట్లతో ప్రయోజనం

కంచిలి: వరుస క్రమంలో వరినాట్లు వేయడం వలన పైరు ఆరోగ్యవంతంగా ఎదిగి రైతుకు ప్రయోజనం కలిగిస్తుందని సోంపేట సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు పి.జగన్మోహనరావు అన్నారు. అంపురం గ్రామంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సేంద్రీయ వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న రైతుల పొలాల్లో ఈ విధానంలో సాగు చేయాల్సిందిగా సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, జడ్‌బీ ఎన్ఎఫ్ మండల యాంకర్ టి.శివానందం ఉన్నారు.


పొలంబడిలో సూచనలిస్తున్న జగన్మోహనరావు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం రూరల్: ఎటువంటి సేంద్రియ ఎరువులు ఉపయోగించకుండా, కేవలం జీవ ఎరువులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ చేయాలని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి మహిళా పెరటి తోట ప్రాముఖ్యతను తెలుసుకొని నిత్య కూరగాయలు, ఆకు కూరలను పెంచాలని, తద్వారా ఆర్థికాభివృద్ధి పొందవచ్చని అన్నారు.

పింగళికి ఘనంగా నివాళి

ఇచ్ఛాపురం రూరల్: జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలను ఎం.తోటూరు, ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.సుహాశ్ చంద్, కె.సూర్యనారాయణలు మాట్లాడుతూ.. భారతదేశానికి చిహ్నమైన మూడు రంగుల మువ్వెన్నల జెండాను పింగళి తయారు చేశారన్నారు. కాషాయ రంగు త్యాగానికి, దేశభక్తికి ప్రతీకగా, తెలుపు రంగు శాంతికి, సత్యానికి, ఆకుపచ్చ రంగు సమృద్ధికి, నమ్మకానికి గుర్తుగా, అశోక ధర్మ చక్రం ధర్మానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇన్నేశుపేటలో 170 అడుగుల జెండాను ఆవిష్కరించి, పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, మండల అధ్యక్షుడు బి.శంకరం, గోపాలకృష్ణ, దాశరధిలు పాల్గొన్నారు.

కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆరో తరగతి విద్యార్థులు తమ పాఠ్య పుస్తకంలో ఉన్న పాఠ్యాంశాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు.

కవిటి: జాతీయ పతాకం భారతీయుల ఆత్మగౌరవానికి చిహ్నమని పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ అన్నారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా చిన్నారులు జాతీయ పతాకాన్ని చేతబట్టి గ్రామవీధులు తిరిగి ఆయన కృషిని వివరిస్తూ నినాదాలు చేశారు.


కవిటి: పీఎస్‌జీ పుట్టుగలో జాతీయ జెండాతో చిన్నారులు


ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరులో పింగళికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


కంచిలి: పింగళి పాఠ్యాంశాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కిడ్నీ కేంద్రం వద్ద మొక్కలు నాటివేత


మొక్కలు నాటుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం వద్ద ఆ నలుగురు సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, వైద్యులు మోహనబాబు, నెఫ్రాలజిస్టు డాక్టర్ రాకేష్, నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకరరావు, దడియాల నరసింహులు ఉన్నారు.

స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు

టెక్కలి: స్థానిక శ్యామసుందరాపురం సమీపంలోని జగనన్న కాలనీలో తన స్థలాన్ని ఆక్రమించారంటూ స్థానిక బ్రాహ్మణవీధికి చెందిన రఘునాథ్ సాహు రెవెన్యూ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తనకు నిబంధనల మేరకు ప్రభుత్వం ఇంటి స్థలాన్ని మంజూరు చేశారని.. అదే స్థలంలో మరో వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నారని తనకు న్యాయం జరిగేలా చూడాలని రఘునాథ్ సాహు విన్నవించారు.

ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

టెక్కలి: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. టెక్కలి అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ అంశాన్ని గతంలో సాధ్యం కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు మతోన్మాద బీజేపీ కక్షపూరితంగా వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ అగ్ర నాయకుడు అమిత్‌షా కాళ్ల దగ్గర దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా మాదిగ దండోరా నాయకుడు మందకృష్ణ మాదిగ వ్యవహరించారని ఆరోపించారు. తక్షణమే ఇటువంటి నిర్ణయాలను వెనక్కితీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు చల్లా రామారావు, వై.గోపి, కె.కామేశ్వరరావు, ధర్మారావు, శ్రీను, లింగరాజు, బి.నారాయణరావు, శ్రీనివాస్, ఆట్ల రాహుల్, అరవింద్, నవీన్, నాయుడు, కూరాకుల యాదవ్, బాబురావు, తరుణ్, తిలక్, వీరాస్వామి, రాజారావు కోరారు.


నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు